ఎంఎల్‌ఎ గ్రీవెన్స్‌కు 11 ఫిర్యాదులు

ప్రజాశక్తి - కొవ్వూరు

పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు గ్రీవెన్స్ డే నిర్వహించారు. ప్రజల మంచి సమస్యలు అడిగి తెలుసుకుని వాటికి పరిష్కార మార్గాలు సూచించారు. ఈ గ్రీవెన్స్ డేలో 11 అర్జీలు అందాయని ఆయన తెలిపారు. రేషన్ కార్డులు ఇప్పించాలని, హెల్త్ పింఛన్లు ఇప్పించాలని, బర్త్ సర్టిఫికెట్‌లో పేరు మార్పు చేయాలని, బ్రిడ్జిపేటలో మంచినీటి సౌకర్యం కోసం పైప్ లైన్ నిర్మించాలని కోరుతూ అర్జీలు వచ్చాయన్నారు. వీటని త్వరలోనే పరిష్కరిస్తామని ఎంఎల్‌ఎ తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎంఎల్‌ఎ ముప్పిడి

డిగ్రీ ప్రవేశాలు ఇంకెప్పుడు..?

నోటిఫికేషన్ ఇవ్వని ప్రభుత్వం
ఇంటర్ ఫలితాలు వచ్చి దాదాపుగా 4 నెలలు
అయోమయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఇంటర్ పూర్తయిన విద్యార్థులు డిగ్రీలో ప్రవేశాల కోసం ఎదురుచూస్తున్నారు. ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థుల్లో సగం మందికి పైగా ఇంజినీరింగ్ వైపు దృష్టి సారించగా మిగిలిన సగం మందికి డిగ్రీ విద్య ప్రత్యామ్నాయం. డిగ్రీలో సైతం పలు సాంకేతిక కోర్సులతో పాటు ఆర్ట్స్, సైన్స్ సబ్జెక్టులతో కోర్సుల అందుబాటులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో 50 శాతం మంది విద్యార్థులు డిగ్రీ కోర్సులు పూర్తి చేసి సివిల్స్, సర్వీస్ కమిషన్, బ్యాంకింగ్, రైల్వేలో ఉద్యోగాలు సాధించే అవకాశం ఉండటంతో ఈ కోర్సులపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం 2025-26 విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకూ డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేయలేదు.

తక్షణమే డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించాలి

కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన అనంతరం ప్రభుత్వ విద్యా వ్యవస్థ నిర్వీర్యమవుతోంది. ఇప్పటికే పలు అసంబద్ధ నిర్ణయాలతో పాఠశాల విద్యను అటకెక్కించారు. ఇప్పుడు డిగ్రీ విద్యను కూడా నాశనం చేయాలని చూస్తున్నారు. ఇంటర్ ఫలితాలు వెల్లడై దాదాపు 3 నెలలు గడిచింది. విద్యా సంవత్సరం ప్రారంభమై 2 నెలలు గడిచింది. డిగ్రీ ప్రవేశాలు ఇంకెప్పుడు చేపడతారు. తక్షణమే డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించాలి.

- ఎన్.రాజా,ఎస్‌ఎఫ్‌ఐ, జిల్లా కార్యదర్శి

ఇంటర్ ఫలితాలు వచ్చి నాలుగు నెలలు

ప్రభుత్వం ఇంటర్మీడియట్ ఫలితాలను ఈ ఏడాది 12న విడుదల చేసింది. పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు కూడా నిర్వహించి జూన్ 8న ఫలితాలు విడుదల చేసింది. ఇంజినీరింగ్ ప్రవేశాలకు కౌన్సిలింగ్ ముగిసి విద్యార్థులు తమకు సీటు వచ్చిన కళాశాలల్లో ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకూ రిపోర్టు చేయనున్నారు. తమతో పాటు ఇంటర్మీడియెట్ రాసిన మిత్రుల్లో కొందరు ఇంజినీరింగ్ విద్యకు వెళ్లడం వారు మరో మూడు నాలుగు రోజుల్లో తరగతులకు హాజరయ్యే పరిస్థితి ఉంది. వారితో పాటే ఇంటర్ పూర్తిచేసుకుని డిగ్రీ కోర్సుల్లో చేరుదామని ఎదురు చూస్తున్న విద్యార్థులకు మాత్రం ఇప్పటి వరకూ నోటిఫికేషన్ ఇవ్వకపోవడంతో ఆందోళన నెలకొంది. ప్రభుత్వం డిగ్రీ విద్యను ఎంత నిర్లక్ష్యం చేస్తోందో అర్థమవుతుందని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎదురు చూపులతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు.

డిగ్రీలో ఏఏ కోర్సులత ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఏ కోర్సులు తేలికగా పూర్తి చేసి, పూర్తి చేసిన వెంటనే ఉద్యోగాలు వచ్చే కోర్సులు ఏమిటి అనే విషయాలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇప్పటికే తమకు తెలిసిన వారిని సంప్రదించి ఒక నిర్ణయానికి వచ్చారు. డిగ్రీ కోర్సులలో ప్రవేశాల కోసంఎదురు చూస్తున్నారు. సాధారణంగా ఇంటర్మీడియట్ ఫలితాలు వెలువడిన నెలలోపు డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించి విద్యా సంవత్సరం ఆరంభం నాటికి విద్యార్థులంతా కళాశాలలకు వెళ్లే ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకూ ఆదిశగా ఏ చర్యా తీసుకోకపోవడంతో విద్యార్థులు వారి తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

లోపాలు లేకుండా పెన్షన్ల పంపిణీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

లబ్ధిదారులు, స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా ఒకటవ తేదీన అర్హత కలిగిన లబ్ధిదారులకు వారి నివాసాల వద్దకు వెళ్లి పెన్షన్ పంపిణీ చేసేందుకు కట్టుబడి ఉందని, ఈ కార్యక్రమం ప్రజల సంతృప్తికి దోహదపడేలా కార్యకలాపాలు నిర్వహించాలని పెన్షన్ పంపిణీ అధికారులను (వార్డు, వాలంటీర్ స్థాయి అధికారులు) కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. 49వ వార్డులో పెన్షన్ పంపిణీ ప్రక్రియపై స్వయంగా సమీక్షించేందుకు కలెక్టర్ శుక్రవారం సాయంత్రం లబ్ధిదారులు, స్థానిక ప్రజలను కలిశారు. వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన బదిలీల్లో పలువురు సచివాలయ సిబ్బంది బదిలీ అయ్యారన్నారు. కొత్త ప్రదేశాల్లో విధులు ప్రారంభించిన వారు స్థానిక ప్రజలతో మమేకమై పనిచేయాలన్నారు. వారిని అర్థం చేసుకుని సేవలందించడంలో తగిన ప్రాధాన్యత చూపాలన్నారు. ఈ సందర్భంగా తల్లికి వందనం, పింఛను , రేషన్ కార్డులు, ఇంటి స్థలాలు మొదలైన పథకాలు అందలేదని పలువురు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయా ఫిర్యాదులను తక్షణమే స్వీకరించి, వాటి యధార్థ స్థితిని పరిశీలించి నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆగస్టు ఒకటవ తేదీన సింహాచలం నగర్ 49వ వార్డులో జరిగిన పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించిన సందర్భంగా, ఫిర్యాదులు వచ్చే అవసరం లేకుండా ముందుగానే సమస్యలను గుర్తించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలందించాలన్నారు. సచివాలయ సిబ్బంది ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి అర్హత కలిగిన లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు శాతం నూరు అందించాల్సిన బాధ్యత వారిదేనన్నారు. అలాగే, పౌర సేవల నాణ్యతను పెంపొందించేందుకు ఐవిఆర్‌ఎస్(ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్) ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు వెల్లడించారు. ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా, పారదర్శకంగా, సమర్థంగా పౌర సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్‌ఎంసి అధికారి శైలజావల్లి, డిఆర్‌డిఎ పీడీ ఎన్‌విఎస్.మూర్తి తదతరులున్నారు.

బిజెపి, ఎలక్షన్ కమిషన్‌కు వ్యతిరేకంగా ధర్నా

ప్రజాశక్తి - నిడదవోలు

అధికారం కోసం దేశ ప్రజలను అవమానించి బిజెపి, ఎలక్షన్ కమిషన్ తీరును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిడదవోలు అంబేద్కర్ చౌక్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ నియోజకవర్గం కో ఆర్డినేటర్ మేడవరపు భద్రం దొర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. బిజెపి దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ భారతదేశ రాజ్యాంగాన్ని అవమానపరిచి అప్రజస్వామికంగా బిజెపి అధికారాన్ని చేపట్టిందన్నారు. కేంద్ర ఎలక్షన్ కమిషన్, బిజెపి కుమ్మక్కై భారతదేశ రాజ్యాంగానికి వ్యతిరేకంగా అధికారం కోసం ఓట్లను చోరీ చేసిందన్నారు. ఇంత నీచ స్థితికి దిగజారిన బిజెపికి దేశాన్ని పాలించే అర్హత లేదన్నారు. తక్షణమే రాజీనామా చేసి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం దేశాన్ని దోచుకుంటుందని విమర్శించారు. తమ అగ్రనేత రాహుల్ గాంధీ 40 లక్షల దొంగ ఓట్లను సాక్షాలతో, ఆధారాలతో సహా నిరూపించారన్నారు. ఈ దేశంలో భారత రాజ్యాంగ గౌరవం కోసం, దేశ ప్రజల కోసం పోరాడుతున్న ఒకే ఒక్క నాయకుడు ఆయనే అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ, జిల్లా సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ అగర్వాల్ హీరాలాల్, పెరవలి మండల అధ్యక్షులు బుద్ధన లక్ష్మణరావు, నిడదవోలు మండల అధ్యక్షులు భావన రమేష్, పట్టణ మైనారిటీ విభాగం అధ్యక్షులు షేక్ నాగూర్, కాకి కిషోర్, గుర్రం రమేష్, మహ్మద్ అన్వర్ ఖాన్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు, కార్యర్తలు

సిపిఐ జిల్లా కార్యదర్శిగా తాటిపాక మధు ఎన్నిక

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి

సిపిఐ తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శిగా తాటిపాక మధు తిరిగి ఎన్నికయ్యారు. జిల్లా ఏర్పడిన తర్వాత ఆయన రెండవసారి జిల్లా కార్యదర్శి అయ్యారు. జిల్లా సహాయ కార్యదర్శులుగా కుండ్రపు రాంబాబు, రేఖా భాస్కరరావు ఎన్నికయ్యారు. సిపిఐ రాష్ట్ర నాయకుల సమక్షంలో 41 మంది జిల్లా సమితిని ఎన్నుకున్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా వి.కొండలరావు, కె.జ్యోతిరాజు, పంతం నాగేశ్వరావు, పి.లావణ్య, తోట లక్ష్మణ్, చింతల పూడి సునీల్, పి.త్రిమూర్తులు, కె.శ్రీనువాసు, ఎంఎస్‌కె.ప్రసాద్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన సమితిని ఉద్దేశించి మధు మాట్లాడారు. తనను మరోసారి కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు కీతజ్ఞతలు తెలిపారు. రానున్న కాలంలో ప్రజా సమస్యలపై దృష్టి సారించి ప్రజా పోరాటాలు నిర్వహిస్తానని తెలిపారు. అనంతరం పలు తీర్మానాలు జిల్లా కార్యదర్శి ప్రవేశ పెట్టగా మహాసభ ఆమోదించింది

నిడదవోలులో కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి - నిడదవోలు

పట్టణంలో జగనన్న కాలనీలో శుక్రవారం ఉదయం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. జగనన్న కాలనీలో ప్రతి ఇంటినీ పోలీసులు పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గంజాయి, మత్తు పదార్థాల అమ్మకాలపై ఆరా తీశారు. ఎవరైనా నేరస్తులు ఉన్నారా? అనే విషయాలపై తనిఖీలు నిర్వహించారు. పత్రాలు లేని వాహనాలు సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు, సరైన పత్రాలు చూపించి వాహనాలను తీసుకువెళ్లాలని తెలిపారు. పట్టణ సిఐ పివిజి.తిలక్, నిడదవోలు, కొవ్వూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ట్రైనీ ఎస్‌ఐలు, పోలీసులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు చీరల పంపిణీ

ప్రజాశక్తి-కడియం

జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు కడియం మండలం పొట్టిలంకలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టిడిపి వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ మహిళా కార్మికులకు చీరలు సమకూర్చారు. చేనేత కార్మికులు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు వెళ్లాలని ఆశించారు. వైస్ ఎంపిపి కలిదిండి విశాలాక్షి, టిడిపి గ్రామ అధ్యక్షులు కొత్తపల్లి శ్రీరామ్, వి.శ్రీనివాస్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యకామంలో తమ్మా నాగేంద్ర, కలిదిండి సత్యనారాయణ , నీళ్ల సత్తిబాబు, వాస వీరభద్రరావు, ఎం.రాజు, చల్లా వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



రాష్ట్ర స్థాయి టార్గెట్‌బాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - చాగల్లు

పోటీలను ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ వెంకటేశ్వరరావు

చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి టార్గెట్ బాల్ పోటీలను ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు, ఈ కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ పాల్గొన్నారు, ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమన్నారు. క్రీడల్లో రాణించేలా ప్రతి క్రీడా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన సూచించారు. క్రీడాకారుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తుందని తెలిపారు. క్రీడలకు కావాల్సిన సౌకర్యాల కల్పనకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లక్ష్యం క్రీడా ప్రోత్సాహమే అని ఆయన తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ క్రీడలను ప్రారంభించడం సంతోషకరమన్నారు. నియోజకవర్గంలో ప్రతి ప్రభుత్వ పాఠశాలలో క్రీడలకు కావాల్సిన సౌకర్యాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. శాప్ డైరెక్టర్ రవీంద్ర మాట్లాడుతూ క్రీడాకారులకు కావాల్సిన సౌకర్యాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత క్రీడలకు పెద్దపీట వేశారని ఆయన తెలియజేశారు, ఎఎంసి చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యతో పాటూ క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడల విషయంలో పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. చాగల్లులో రాష్ట్ర వ్యాప్త క్రీడలు నిర్వహించడం గర్వకారణమన్నారు. 13 జిల్లాల నుంచి విచ్చేసిన విద్యార్థులకు వారికి వసతి, భోజన సదుపాయాలు ఏర్పాటు చేసిన నఫీజ్ ఫైర్ వర్క్ అధినేత మహ్మద్ నఫీజ్‌కు ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. పీడీ జె.విజయలక్ష్మి కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కరటూరి సతీష్, దొంగ రామకృష్ణ, తాళ్లూరి ప్రసాద్, తాళ్లూరి శ్రీను, బొల్లిన శివనాగేంద్ర, తాళ్లూరు ప్రసాద్, మిరియాల సతీష్, పిఇటి సుధాకర్, జిల్లా పీడీ అసోసియేషన్ సెక్రెటరీ నాగరాజు, సీనియర్ పిడీ చిక్కాల సతీష్ కుమార్, పాలేటి శ్రీనివాస్, కోడి రామ్‌కుమార్, ఎస్‌ఎంసి చైర్మన్ గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

శిశువులకు బెడ్ షీట్లు, దోమతెరల పంపిణీ

ప్రజాశక్తి - నిడదవోలు

పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు ప్రెసిడెంట్ మీసాల శివరామహరిప్రసాద్ ఆధ్వర్యంలో ఆయన సతీమణి కీర్తిశేషులు దుర్గాంబ జ్ఞాపకార్థం, మీసాల కాశీబాబు కనకమహాలక్ష్మి దంపతుల ఆర్థిక సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రిలోని 40 మంది రోగులకు పౌష్టికాహారం, నవజాత శిశువులకు దోమతెరలు, బెడ్ షీట్లు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు ప్రెసిడెంట్ మీసాల శివరామ హరిప్రసాద్, సెక్రెటరీ దారపురెడ్డి శ్రీరామ ప్రతాప్, ట్రెజరర్ గుంటిపల్లి సత్యసాయి, సీనియర్ రొటేరియన్స్ ఉప్పులూరి రామ్మోహన్రావు, ఈరిశెట్టి రాజగోపాలస్వామి, గుంటిపల్లి శివ, గాజుల రంగారావు, ఎం.డి.ఫయాజ్, గోపిరెడ్డి శ్రీనివాస్, సానేపు వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్‌తో అధిక ఆదాయం

ప్రజాశక్తి-గోకవరం

ఆయిల్ పామ్ సాగుతో అధికాదాయం పొందొచ్చని పతంజలి సంస్థ డిజిఎం ఎఎస్.ప్రకాష్ రైతులకు సూచించారు. ఆయిల్‌పామ్ తోటల విస్తరణ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెదురుపాక గ్రామంలో ఉద్యాన శాఖ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆయిల్ పామ్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ పామ్ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రకాష్ పాల్గొని మాట్లాడారు. పామాయిల్ తోటల సాగులో కొత్త విధానాలను అవలంబించడం ద్వారా గోకవరం మండలంలోని రైతులు అత్యధిక ఆదాయంలు పొందుతున్నారని తెలిపారు. ఇక్కడ సారవంతమైన నేలలు పామాయిల్ పంటకు అత్యంత అనుకూలంగా ఉంటాయని తెలిపారు. అదేవిధంగా పంట ప్రాముఖ్యత, రైతులకు కంపనీ ద్వారా అందించే సేవలు, సదుపాయాలు, పంట సాగులో ఎరువుల యాజమాన్యం, సాగులో సులభతరమైన మెళకువలు, సాగులో విజయం సాధించిన రైతుల విజయ గాదల గురించి వివరించారు. హార్టికల్చర్ అధికారి పి.రిని మాట్లాడుతూ పామాయిల్ సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలు, సూక్ష్మ సేద్యంలో ఇస్తున్న రాయితీలు గురించి వివరించారు. డ్రిప్ ద్వారా తోటకు ఎరువులు వేయడం, దీని వల్ల కలిగే ఉపయోగాలు, అంతరపంటల సాగు గురించి వివరించారు. అనంతరం ఆయిల్ ఫామ్ ఉత్తమ రైతుగా ఎంపికైన కొత్తల వీరప్పారావును పతంజలి సంస్థ డిజిఎం, ఉద్యాన శాఖ అధికారి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిఎ సురేఖ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ డిఎస్.శ్రీనివాస్, ఫీల్డ్ ఆఫీసర్ కె.కార్తీక్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి డి.ఉమామహేశ్వరరావు, ఫీల్డ్ సూపర్‌వైజర్ ఎస్.శివ, ఎం.అప్పారావు, పివివి.సాయి, పామాయిల్ రైతులు పాల్గొన్నారు.

రైతు వీరప్పారావును సత్కరిస్తున్నపతంజలి డిజిఎం

ఘనంగా దేవినాగేశ్వరావు పుట్టినరోజు

ప్రజాశక్తి-కడియం

మండలం లోని దుళ్ల గ్రామానికి చెందిన తెలుగుయువత మండల అధ్యక్షుడు ముమ్మిడి దేవి నాగేశ్వరరావు పుట్టిన రోజు వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. పలువురు కూటమి నాయకుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఆయన పుట్టిన రోజు కేక్ కట్ చేశారు. పలువురు నాయకులు, కార్యకర్తలు శాలువాలు, పూలమాలలతో ఆయన్ని సత్కరించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అందరికీ మిఠాయిలు పంచారు.

మాజీ ఎంపీ గిరజాల ఇంట వివాహ సందడి

ప్రజాశక్తి-కడియం

వివాహ వేడుకల్లో పాల్గొన్న పలువురు ప్రముఖులు

రాజమహేంద్రవరం మాజీ ఎంపీ గిరజాల వెంకటస్వామి నాయుడు మనవరాలు వివాహ వేడుక స్థానిక జిఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో గురువారం రాత్రి ఘనంగా జరిగింది. వధూవరులు గిరజాల సంతోషి, తోట శ్రీనివాస్‌లను వేడుకలకు విచ్చేసిన నేతలు, బంధుమిత్రులు ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న వారిలో రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, కొత్తపేట ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు, ఎంఎల్‌సిలు సోము వీర్రాజు, తోట త్రిమూర్తులు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ ఎంఎల్‌ఎలు జక్కంపూడి రాజా, వరుపుల సుబ్బారావు, విజయనగరం మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ, మాజీ ఎంఎల్‌ఎలు బొత్స అప్పలనర్సయ్య, బొత్స అప్పలనాయుడు, నాయకులు ఆకుల వీర్రాజు, కంటిపూడి సర్వారాయుడు, ఆకుల రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఉచిత బస్సు ప్రారంభానికి ఎంఎల్‌ఎ నెహ్రూకు ఆహ్వానం

ప్రజాశక్తి-గోకవరం



ఎంఎల్‌ఎ నెహ్రూను ఆహ్వానిస్తున్న డిపో మేనేజర్ సుచరిత

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ఆగస్టు 15న రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభిస్తున్నారు. అందులో భాగంగా జగ్గంపేట నియోజకవర్గం గోకవరం డిపో నుంచి ఈ సర్వీసులు ప్రారంభించేందుకు ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూను డిపో మేనేజర్ సుచరిత మార్గరేట్ శుక్రవారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ నెహ్రూ మాట్లాడుతూ సూపర్ సిక్స్' హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ వసతి 'స్త్రీ శక్తి' పేరుతో ఈనెల 15 నుంచి అమల్లోకి వస్తోందన్నారు. ఆ రోజు నుంచి మహిళలు ఐదు రకాల బస్సుల్లో రాష్ట్ర మంతా ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించొచ్చన్నారు. రాష్ట్రానికి చెందిన మహిళలు, విద్యార్థినులు, ట్రాన్స్‌జెండర్లు ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డును చూపించి పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించొచ్చన్నారు. నాన్‌స్టాప్, అంతర్రాష్ట్ర సర్వీసులు, ఇతర కేటగిరీ బస్సులకు, కాంట్రాక్ట్ క్యారేజ్ సర్వీసులు, ఛార్టెడ్ సర్వీసులు, ప్యాకేజీ టూర్లకు ఇది వర్తించదన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.అప్పారావు, ఎస్ఎమ్.రావు ఎడిసి, కార్మిక పరిషత్ యూనియన్ నాయకులు. వీరభద్రరావు, పి.శ్రీనివాస రావు, ఎంపిటిసి మాజీ సభ్యులు పి.బుజ్జి, దొర పాల్గొన్నారు.

కడియపు లంకలో కరెన్సీ లక్ష్మి

ప్రజాశక్తి-కడియం

మండలంలోని కడియపులంక శ్రీపుంతలో ముసలమ్మ వారిని రూ. 30 లక్షల నోట్లతో అద్భుతంగా అలంకరించారు. శ్రావణ మాసం వరలక్ష్మి దేవి వ్రతం సందర్భంగా శుక్రవారం అమ్మవారికి ఈ అలంకరణ జరిగింది. ధనలక్ష్మి అమ్మవారిగా ముసలమ్మవారు దర్శనమిస్తున్నారు. సిరులను కురిపించే ధనలక్ష్మి దేవిగా కొత్త నోట్లతో అమ్మవారు కళకళలాడుతున్నారు. అమ్మవారిని దర్శించుకోవడానికి శుక్రవారం తెల్లవారుజాము నుంచి భక్తులు క్యూ కట్టారు.

ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్‌పై విమర్శలు తగవు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి

ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్‌పై లేనిపోని విమర్శలు తగవని టిఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి యాళ్ల శ్రీనివాసరావు అన్నారు. వైసిపి పాలనలో కార్మికులకు అన్యాయం జరిగితే అదే పార్టీలో ఉన్న బొజ్జ రామకృష్ణ ఏం మాట్లాడకుండా ఇప్పుడు కూటమి ప్రభుత్వాన్ని, ఎంఎల్‌ఎ శ్రీనివాస్‌ను విమర్శించడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి ఎలక్ట్రికల్ యూనియన్ అధ్యక్షుడినని చెప్పుకునే బొజ్జ రామకృష్ణ అసలు ఎలక్ట్రికల్ కార్మికుడే కాదన్నారు. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలన్నారు.

నేరాలు ఘోరాలు

డివైడర్ పైకి దూసుకెళ్లిన కంటైనర్

డివైడర్ పైకి దూసుకెళ్లిన కంటైనర్

ప్రజాశక్తి - గోపాలపురం

కంటైనర్ అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. ఈ ఘటన గోపాలపురంలో శుక్రవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ నుంచి దేవరపల్లి మండలంలోని ఒక ఫ్యాక్టరీ వద్దకు ఊక లోడుతో వస్తున్న కంటైనర్ లారీ గోపాలపురం వైఎస్ఆర్ జంక్షన్ వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి డివైడర్ పైకి ఎక్కి నిలిచిపోయింది. డ్రైవర్ నిద్రమత్తే దీనికి కారణంగా భావిస్తున్నారు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది, స్థానికులు చాకచక్యంగా లారీని అక్కడి నుంచి దించి పంపించారు.

ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-కాజులూరు

బైక్ అదుపు తప్పి గాయపడిన ఒక యువకుడు మృతి చెందాడు. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం అయితపూడి గ్రామానికి చెందిన పడాల సంతోష్ కుమార్ (22) పొలానికి వెళుతూ బైక్ అదుపు తప్పడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు సంతోష్ తండ్రికి సమాచారం అందించడంతో ఆయన హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని కాకినాడ రాఘవ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలు కావడంతో సంతోష్ కుమార్ ఆసుపత్రిలో మరణించారని వారు తెలిపారు. కేసును గొల్లపాలెం ఎస్ఐ మోహన్ కుమార్ దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుల ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలో రాజవరం, పేరవరం గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్తోపాటు, మూడు మండలాల ఎస్ఐలు, ఇతర సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రికార్డులు లేని 20 వాహనాలతోపాటు, 20 లీటర్ల సారాతో ఒక మహిళను అరెస్టు చేశారు. 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ తనిఖీల్లో రికార్డు లేని 20 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాటికి ఉన్న రికార్డు చూపిస్తే తిరిగి ఇస్తామని లేదంటే బ్రేక్ ఇన్స్పెక్టర్కు అప్పగిస్తామని సిఐ విద్యాసాగర్ తెలిపారు. ఈ తనిఖీలలో ఆత్రేయపురం, కొత్తపేట, ఆలమూరు ఎస్ఐలు రాము, సురేంద్ర, నరేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో గృహం ధ్వంసం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

గ్యాస్ సిలెండర్ లీకై సంభవించిన ఘటనలో ఒక గృహం ధ్వంసమైంది. దీనికి సంబంధించి స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక మూడవ వార్డు పరిధిలోని చింతలమెరక గ్రామంలో మట్టపర్తి ప్రసాదుకు చెందిన ఇంటిలో శుక్రవారం గ్యాస్ సిలింలెండర్ లీక్ కావడంతో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇంటిలోని బంగారు ఆభరణాలు, విలువైన దస్తావేజులు, స్కూలు సర్టిఫికేట్లు దహనం అయ్యాయని, సుమారు రూ.3.50 లక్షల వరకూ ఆస్తి నష్టం సంభవించినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

చోరీ జరిగిన ఇల్లు

ములికిపల్లిలో ఇంట్లో చోరీ

ప్రజాశక్తి - రాజోలు

ములికిపల్లి గ్రామాల్లో తాళాలు వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఇంటి యజమాని కట్టా వెంకటలక్ష్మి ఈ నెల 7వ తేదీన ఏలూరులో ఉన్న బంధువుల ఇంటికి వెళ్ళింది. 8వ తేదీ ఉదయం పని మనిషి వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. ఈ విషయం యజమాని వెంకటలక్ష్మికి ఫోన్ చేసి చెప్పింది. ఆమె వచ్చి చేసేసరికి ఇంటి తలుపులు లోపల ఉన్న బీరువా తలుపులు బద్దలు కొట్టి ఉన్నాయి. దొంగతనం జరిగింది అని గ్రహించిన వెంకటలక్ష్మి పోలీసులకు సమాచారం అందించింది. సంఘటనా స్థలాన్ని సిఐ నరేష్కుమార్ పరిశీలించారు. క్యూస్ టీమ్ రంగంలో దిగి వేలిముద్రలు సేకరించింది. బీరువాలో ఉన్న రూ.ఐదు లక్షల నగదు, ఆరు కాసుల బంగారు గాజులు చోరీ కి గురైనట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

చోరీ కేసు దర్యాప్తు ముమ్మరం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

ఇటీవల చేందుర్తి జంక్షన్ వద్ద ఆభరణాల చోరీ కేసుపై ఎఎస్పి మనీష్ దేవరాజ్ పాటిల్ పర్యవేక్షణలో సిఐ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నలుగురు ఎస్ఐలతో కూడిన బృందాలతో పోలీసులు దర్యాప్తు ముమ్మరంగా చేపట్టారు. నిందితుల కోసం అనేక కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు. సిసి ఫుటేజి, సెల్ టవర్ ఆధారంగా చోరీలో ఐదుగురు నిందితులు పాల్గొన్నట్టు పోలీసులు గుర్తించారు.

అరుదైన పుష్పాల పంపిణీ

ప్రజాశక్తి - జగ్గంపేట

అరుదుగా లభించే శివలింగ పుష్పాలను స్థానిక శెట్టిబలిజిపేటకు చెందిన పాలిక అప్పారావు శుక్రవారం పలువురికి పంపిణీ చేశారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని జగ్గంపేటలోని పురవీధుల్లో తిరిగి ఇంటింటికీ ఉచితంగా పూజలకు కావాల్సిన మారేడు, జమ్మి, తులసి, నేరేడు, వివిధ రకాల పత్రులను అందజేశారు. ఆయనను పలువురు అభినందించారు.

ఉపాధి లేక మేకప్ కళాకారుల అవస్థలు

ప్రజాశక్తి-పెద్దాపురం

ఒకప్పుడు పౌరాణిక, సాంఘిక నాటక రంగం, అమ్మ తల్లులు, గ్రామ దేవతల జాతరల రంగం జరిగే కాలంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలు ప్రాంతాలలో మేకప్ కళాకారులకు చేతి నిండా పని ఉండేది. పౌరాణిక, సాంఘిక నాటక రంగాలు కనుమరుగయ్యాయి, అప్పుడప్పుడు పరిషత్తు నాటక పోటీలు మాత్రమే దర్శన మిస్తున్నాయి. ప్రస్తుత గ్రామ దేవతల జాతరలు మాత్రమే మేకప్ కళాకారులకు ఉపాధి కల్పిస్తున్నాయి. ఈ తరుణంలో ఏడాది పొడవునా పని లేక అనేకమంది మేకప్ కళాకారులు ఈ వృత్తి నుండి తప్పుకుని వేరే వృత్తుల్లో స్థిరపడిపోతున్నారు. ప్రస్తుతం కొంతమంది కళాకారులు మాత్రమే కాకినాడ, రాజమండ్రి ప్రాంతాలలో మేకప్ కళాకారులుగా మిగిలారు.

మేకప్ చేస్తున్న నాగేంద్రబాబు

మేకప్ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

మేకప్ కళాకారులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని రాజమండ్రి హేమ డ్రెస్ కంపెనీకి చెందిన మేకప్ ఆర్టిస్ట్ బుర్రే నాగేంద్రబాబు జయంతి అన్నారు. స్థానిక మరిడమ్మ అమ్మవారి జాతరలో భాగంగా స్థానిక వరహాలయ్యపేట వాసులు ఆదివారం నిర్వహిస్తున్న మరిడమ్మ సంబరంలో బండి వేషాల పాత్రధారులకు మేకప్ వేసేందుకు వచ్చిన ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతల జాతరలలో బళ్ళ వేషాలు ఏర్పాటు చేసినప్పుడు మాత్రమే తమకు పని ఉంటుందన్నారు. ఇటీవల కాలంలో అన్ని గ్రామాల్లో గ్రామదేవతల జాతరలు నిర్వహిస్తున్నా బండి వేషాలు తగ్గించి వేస్తున్నారన్నారు. వరహాలయ్య పేట సంబరంలో మూడు వేషాల బండ్లు మాత్రమే ఏర్పాటు చేయటం వల్ల ఇద్దరం మాత్రమే మేకప్ చేస్తున్నామన్నారు. కొన్ని జాతర సంబరాలలో పది నుండి 20 వరకు వేషాల బండ్లు ఏర్పాటు చేసే వారన్నారు. వేషాల బండి డెకరేషన్, లైటింగ్కు వ్యయం ఎక్కువ అవడంతో ప్రస్తుతం ఈ సంఖ్యను ఒకటి నుండి మూడు బండ్లకు తగ్గించి వేయడంతో తమకు పూర్తి స్థాయిలో ఉపాధి లభించడం లేదన్నారు. పౌరాణిక నాటకాలు పూర్తిగా కనుమరుగయ్యాయన్నారు. ఈ తరుణంలో మిగిలి ఉన్న మేకప్ కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 50 ఏళ్ల వయసు నిండిన కళాకారులకు పింఛన్ ఇవ్వాలని, అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రాచీన కళా సంస్కృతిలో అంతర్భాగమైన జాతరలు అమ్మవారుల సంబరాలలోనే నేటికీ జానపద సంస్కృతి జానపద కళారూపాలు దర్శనమిస్తున్నాయి. పుల్ల మత ధనిక పేద అనే తారతమ్యాలకతీతంగా ప్రజలందరూ ఈ జాతర సంబరాలలో పాల్గొంటున్నారు గ్రామదేవతల జాతరలలో ప్రాచీన జానపద కళారూపాలు ప్రోత్సహించకపోతే జానపద కళా రూపాలు, కళా సంస్కృతి పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.

యానాం వార్తలు

కార్యక్రమంలో మాట్లాడుతున్న తోటరాజు

వచ్చే ఎన్నికల్లో పోటీకి సిద్ధం : తోట రాజు

ప్రజాశక్తి - యానాం

రాబోయే యానాం అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి సిద్ధమైనట్లు ప్రముఖ వ్యాపారవేత్త తోట రాజు ప్రకటించారు. స్థానిక ఫెర్రీ రోడ్డులోని గాలాల గార్డెన్స్లో తోట ఫాలోవర్స్ ఆధ్వర్యంలో నా తొలి అడుగు మీతోనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తోటరాజు మాట్లాడుతూ రాజకీయాల్లోకి రావడానికి గల కారణాలను ప్రజలకు వివరించారు. యానాం నియోజకవర్గం ప్రజలకు సేవలను అందించాలని లక్ష్యంతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రవేశించినట్లు తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలలో ప్రజల ఆశీస్సులతో ఎంఎల్ఎ అభ్యర్థిగా పోటీ చేస్తానని అన్నారు. నియోజకవర్గ ప్రజలందరూ అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఐదు సమస్యలపై తాను పోరాడుతానన్నారు. ఇళ్ల పట్టాలు, పారిశుధ్యం, సాగు తాగునీరు, కుటీర పరిశ్రమల స్థాపన, మత్స్యకార సమస్యలపై మాట్లాడారు. నియోజకవర్గం పరిధిలోని వివిధ గ్రామాల నుండి అధిక సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. ముందుగా తోటరాజు ఫాలోవర్స్, అభిమానులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తోటరాజు ఫాలోవర్స్, పరిసర ప్రాంతాలకు చెందిన యువత తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలపై పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - యానాం

విద్యుత్ తీగలపై పడి యువకుడు మృతి చెందిన సంఘటన యానాంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఐ.పోలవరం మండలం కేసనకుర్రు గ్రామానికి చెందిన చింతా గురుమూర్తి (22) తన మిత్రులతో కలిసి స్థానిక ఫెర్రీ రోడ్డులోని కూనంరెడ్డి గార్డెన్స్లో ఒక పుట్టినరోజు వేడుకకు వచ్చాడు. బిల్డింగ్ పైనుంచి విద్యుత్ తీగలపై పడి మృతి చెందాడన్నారు. మృత దేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తీగలపై గురుమూర్తి మృతదేహం

స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలి

ప్రజాశక్తి - కరప

ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కోరుపల్లిలో భారతరత్న ఫాదర్ ఆఫ్ గ్రీన్ రెవల్యూషన్ అవార్డు గ్రహీత ఎంఎస్ స్వామినాథన్ జయంతి ఎపి కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎకరానికి ఐదు నుంచి పది బస్తాలు మాత్రమే పండేవి ఎమ్మెస్ స్వామినాథన్ దేశ భవిష్యత్తును మార్చేందుకు వరి, గోధుమ వంగడాలపై పరిశోధనలు చేసి ఆకలి కేకలను దూరం చేశారు. నేడు మనదేశంలో ప్రజలందరికీ ఆహార ధాన్యాలు సరిపడా పండించడమే కాక విదేశాలకు ఎగుమతి చేసే విధంగా ఆహార పంటలను అభివృద్ధి చేశారన్నారు. 2014లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం స్వామినాథన్ ఆధ్వర్యంలో కమిషన్ ఏర్పాటు చేసింది, ఆ కమిషన్లో క్వింటా ధాన్యానికి రూ.2,000 ఖర్చు అవుతుంది కాబట్టి మరో 50 శాతం అదనంగా కలిపి ఆహార పంటలకు ఇవ్వాలని ఆయన కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేశారన్నారు. ఆ తరవాత ఆయన కుమార్తె జయతీ ఘోష్ కమిషన్ కూడా అప్పుడే నియమించారని తెలిపారు. ఆ కమిషన్ కూడా అదే చెప్పిందన్నారు. నేటికీ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు జరగడం లేదని, ఒక్క కేరళలో మాత్రమే కమిషన్ సిఫార్సులు అమలు చేస్తున్నారని తెలిపారు. దేశమంతా ఆ కమిషన్ సిఫార్సులు అమలు జరిపి ఉంటే నేడు రైతు ఆత్మహత్యలు జరిగేవి కావన్నారు. ఎరువులు, పురుగు మందుల ధరలు పెరుగుతున్నాయని, కానీ రైతులు పండించే పంటల ధరలు పెరగడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి కౌలు రైతుల సంఘం నాయకులు నులుకుర్తి నాగేశ్వరరావు, పెంకే సత్యనారాయణ పెంకే నారాయణ, రెడ్డి భద్రం, అప్పాడ బూరయ్య, దెయ్యాల తాతాజీ, కాదా సత్యనారాయణ, రెడ్డి పెదకాపు, పెంకే వెంకటరమణ, పెంకే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్వామినాథన్కు నివాళులర్పిస్తున్న రైతులు

ఆసుపత్రిలో ఫ్రీజర్లు అందజేస్తున్న బృందం

ప్రభుత్వాసుపత్రికి ఫ్రీజర్ల అందజేత

ప్రజాశక్తి - పెద్దాపురం

కెటిసి విద్యా సంస్థల అధినేత చక్రవర్తి పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి మన పెద్దాపురం ఫేస్బుక్ బందం ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్రీజర్లు అందజేశారు. ఈ సందర్భంగా చక్రవర్తిని మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జగదాంబ, మన పెద్దాపురం ఫేస్బుక్ అడ్మిన్ పెద్దిరెడ్డి నరేష్, ఆనంద్, సతీష్ కుమార్, నెక్కల భుజంగరావు, వడ్డి సత్యనారాయణ, హైదర్ ఆలీ, నాగలక్ష్మి, జి.ఉమా శేఖర్, పి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - సామర్లకోట

కూటమి ప్రభుత్వంలోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్లకోట పెద్దపులి చెరువు వద్ద నుంచి సాయి నగర్కు వెళ్ళే రోడ్డును కలుపుతూ పంచాయితీరాజ్, ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.50 లక్షలతో నిర్మిస్తున్న రహదారి నిర్మాణ పనులకు శుక్రవారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలోనే నిజమైన అభివృద్ధి జరుగుతున్నట్టు చెప్పారు. మారుమూల ప్రాంతాల్లో సైతం రహదారుల నిర్మాణాన్ని చేపట్టడం ద్వారా ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నట్టు చెప్పారు. కోటమ్మ ప్రభుత్వం అందించే అభివద్ధిని ప్రజలు గుర్తించాలన్నారు. కాదా రహదారి నిర్మాణాన్ని నాణ్యతాపరంగా ఎలాంటి రాజీ లేకుండా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అడబాల కుమార స్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, కంటే జగదీశ్ మోహన్ (బాబు), సామర్లకోట సొసైటీ అధ్యక్షుడు పైన శ్రీనివాసరావు, పడాల వీరబాబు, వల్లూరి దొరబాబు, పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పివి.రామకృష్ణయ్య, మండల ఇంజనీర్ యువై.రత్నం, మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, ప్రతిభ పాఠశాల డైరెక్టర్ ఎస్వివిజి.ప్రకాష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

ఆదిత్యలో హర్ ఘర్ తిరంగా

ప్రజాశక్తి-కాకినాడ

ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం, కాకినాడ జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించినట్టు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్ నాయుడు తెలిపారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు 2 నుండి 15వ తేదీ వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ప్రతి భారతీయ పౌరుడి గుండెల నిండా దేశభక్తి ఉండాలని, ప్రతి ఒక్కరూ జాతీయ సమైక్యత భావాలను కలిగి ఉండాలన్నారు. ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కళాశాలపై జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను సెట్రాజ్ సిఇఒ కెఎస్వి.కాశీ విశ్వేశ్వరరావు అభినందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్ఛార్జి మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.తేజేశ్వరరావు, డి.అశ్విని పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - కొత్తపేట, ఆత్రేయపురం

కొత్తపేట మండలంలోని మందేశ్వర స్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి డి.సురేష్బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ధరఖాస్తులను ఫారం-11 ప్రకారం ఆలయ కార్యాలయానికి ఈ ప్రకటన వెలువడిన 20 రోజులలోపు దరఖాస్తులను అందజేయాలని కోరారు. పాలకమండలి సభ్యులు కావాలనే వారిపై ఎటువంటి క్రిమినల్ కేసులు ఉండరాదని, ఇతర సమాచారం కోసం ఆలయ కార్యాలయం అధికారులను సంప్రదించాలని సూచించారు. అలాగే ఆత్రేయపురం మండలంలోని ర్యాలీ గ్రామంలో ఉన్న జగన్మోహిని కేశవ మరియు గోపాల స్వామి దేవస్థానం ధర్మకర్త మండలి నియమానిక దేవాదాయ ధర్మాదాయ శాఖ నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి భాగవతుల వెంకటరమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రకటన వెలువడిన 20 రోజులలోపు పాలకమండలి సభ్యుడిగా పోటీ చేసేందుకు దరఖాస్తులను ఆలయ కార్యాలయంలో అందజేయాలని ఆయన కోరారు.

మండపేట విలీనంపై 10న సమావేశాలు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండపేట నియోజకవర్గాన్ని తూర్పు గోదావరి జిల్లాలో విలీనం చేయాలని కోరుతూ ఈ నెల 10న కపిలేశ్వరపురం, రాయవరం మండలాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ కామన ప్రభాకర్రావు అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయా మండలంలోని అన్ని పార్టీల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మేథావులు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొని సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు మండలంలోని అంగరలో ఉన్న వీర వెంకటసత్యనారాయణ ఫంక్షన్ హాల్లో సమావేశం ఉంటుందని, అలాగే సాయంత్రం 4 గంటలకు రాయవరం మండలంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద మరో సమావేశం ఉంటుందన్నారు.

భీమేశ్వరాలయ అర్చకుడు మృతి

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామ భీమేశ్వరస్వామి దేవస్థానం అనువంశిక వంశపారంపర్య ప్రధాన అర్చకులు కళ్లేపల్లి ఫణికుమార్(83) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆలయ ప్రధాన ద్వారాన్ని మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూసి వేశారు. ఆయన మృతికి ఆలయ ఇఒ అల్లు దుర్గభవాని, ఆలయ సిబ్బంది, అర్చకులు సంతాపం తెలిపారు.

సామూహిక వరలక్ష్మి కుంకుమ పూజలు

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

అంతర్వేది లక్ష్మి నార సింహస్వామి ఆల యంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మి కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు.రాజ్యలక్ష్మి తాయారు అమ్మ వారికి శ్రావణ మాసం మూడో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో పాల్గొన్న వారికి అమ్మవారి రూపు, పూజ సామాగ్రిని ఆలయ అధికారులు ఉచితంగా అందజేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకెటిఎన్వి.వీప్రసాద్ పర్యవేక్షించారు.

ఎపిపికి పలువురి అభినందనలు

ప్రజాశక్తి - ఆలమూరు

రామచంద్రపురం 13వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు అడిషనల్ పిపిగా నియమితులైన కప్పల సునీల్ కుమార్ను పలువురు అభినం దించారు. శుక్రవారం ఆల మూరులో ఆయనను పలు రాజకీయ పార్టీలకు చెందిన మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి, సాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సి నాయకులు నెల్లి చిన్న, టిడిపి నాయకులు ఇ.రాంబాబు, ఇ.నల్లబాబు, మానేపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలపై పిచ్చి మొక్కలు

-పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - గోపాలపురం

ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై పిచ్చి మొక్కలు వృక్షాలుగా మారుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో పలు ప్రభుత్వ భవనాలు ఉన్నాయి. ఒక భవనంలో కింద మండల స్వయం సహాయక సంఘం (డ్వాక్రా) కార్యాలయం, పై అంతస్తులో గ్రామ సచివాలయం-2 కార్యాలయం నిర్వహిస్తున్నారు. ఈ భవనంపై రావి మొక్కలు మొలిచాయి. సుమారు రెండు-మూడు సంవత్సరాలుగా మొక్కలు పెరుగుతూ ఉన్నాయి. ఆ కార్యాలయానికి చెందిన అధికారులు, సిబ్బంది యథావిధిగా విధులు నిర్వర్తించుకుని వెళ్లివస్తున్నారు. కానీ వారు విధులు నిర్వర్తించే భవనంపై భాగాన మొక్కలు పెరుగుతున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అలాగే ప్రస్తుతం స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు కంప్యూటర్ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్న పాత మండల పరిషత్ కార్యాలయంపైనా రావి మొక్కలు దర్శనమిస్తున్నాయి. మొక్కలు పెరిగి వృక్షాలుగా మారుతున్నప్పటికీ అధికారి యంత్రాంగం వాటిని తొలగించే ప్రయత్నం చేయడం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మొక్కలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ కార్యాలయ భవనాలపై మొక్కలు

మారని పేర్లు..తొలగని ఫోటోలు..

ప్రజాశక్తి - దేవరపల్లి

ప్రభుత్వం మారినా...పథకాల పేర్లు మారినా..ఉన్నతాధికారుల ఆదేశాలు ఇచ్చినా స్థానిక అధికారులు అలసత్వంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వైసిపి పాలనలో రైతుల సంక్షేమం కోసమంటూ రైతు బరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్చుతూ వ్యవసాయ శాఖా ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులు వచ్చి నెలలు గడుస్తున్నా ఆ ఆదేశాలు అమలుకు నోచుకోలేదు. ఆఖరికి గత ప్రభుత్వ నాయకుల ఫోటోలను సైతం తొలగించుటంలో అధికారులు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారని కూటమి నాయకులు విమర్శిస్తున్నారు. మండలంలో పలు సచివాలయాల వద్ద రైతు భరోసా కేంద్రాలుగానే నడుస్తున్నాయి. నేటికీ ఆయా కేంద్రాల వద్ద బోర్డులు రైతు భరోసా కేంద్రాలుగానే దర్శనమిస్తున్నాయని, తక్షణమే ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పేర్లు మార్చాలని కూటమి నాయకులు కోరుతున్నారు.

పేరు మార్చని రైతు భరోసా కేంద్రం

నిబంధనలతో ఈక్రాప్ నమోదు చేయలేం

ప్రజాశకి-కాజులూరు

ప్రభుత్వ నిబంధనలతో ఇక్రాప్ నమోదు చేయలేమని వ్యవసాయ శాఖ సహాయకులు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన కాజులూరు వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి అశోక్కు ఈ క్రాప్ నిబంధనలపై గ్రామ వ్యవసాయ శాఖ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ సహాయకులు కిషోర్ నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలతో నమోదుకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయన్నారు. గత సంవత్సరం ఈ క్రాప్ నమోదు చేయాలంటే సుమారు 300 మీటర్ల వరకు సేద్యం చేసే భూమి వద్ద నుండి నమోదు అయ్యేదని, 25 సెంట్లు అయితే ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నమోదు చేసేవారన్నారు.గర్భిణులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని, పంట నమోదు సమయంలో భద్రత లేకుండా ఉందన్నారు. దీంతో గతంలో పాము కరిచి ఒకరు చనిపోయారని తెలిపారు. ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానం కలిగే మొబైల్ గాని ట్యాబ్ గాని అందించాలని, గరిష్ట దూరం 300 మీటర్ల వరకు ఉంచాలని, 25 సెంట్ల భూమికి ఎటువంటి నిబంధనలు విధించకూడదని, బీడు భూములు అంతర పంటలు ఉన్న ప్రాంతాల్లో ద్వారా సర్వే చేయాలని కోరారు. గ్రామ వ్యవసాయ శాఖ సహాయకులు అనివిల్లి ప్రకాష్, దుర్గాప్రసాద్, కిషోర్ నాయుడు, అనిత, పవన్ కుమార్, సత్య ప్రసన్న పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

మండలంలోని భీమనపల్లి పంచాయతీ భట్టుపాలెంకు చెందిన ఆకేటి లక్ష్మీసింధు కు మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కును ఆమె తండ్రి నాగేశ్వరరావుకు ఎంఎల్ఎ ఆనందరావు శుక్రవారం అందజేశారు. లక్ష్మీ సింధు అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందింది. ఈ విషయాన్ని ఎంఎల్ఎ ఆనందరావు దృష్టికి భీమనపల్లి సహకార సొసైటీ అధ్యక్షులు ఆకేటి శ్రీనివాస్ తీసుకువెళ్లారు. దీంతో ఆయన సిఎం సహాయనిధికి రిఫర్ చేశారు. సిఎంఆర్ఎఫ్ నుంచి విడుదలైన రూ.37,465 ఎల్ఓసి మంజూరు పత్రాన్ని ఎంఎల్ఎ ఆమె తండ్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఆనందరావుకు లబ్ధిదారు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

మహారాజశ్రీ కాకినాడ 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EP.389/2024 OS.No.1007/2019
Between:-
రెడ్నం వెంకట సుబ్బారావు ...DHR
And
సుంకర త్రిలేఖ@ కంచుస్తంభం త్రిలేఖ వగైరా ...JDRS
To.
అక్కిరెడ్డి పద్మలత W/o.త్రినాద్ Rep by GPA Holder మునగల శేషమాంభ దేవిW/o.రమేష్. 2-16A-8 శిరంగు వారి వీధి, వెంకటనగర్, కాకినాడ. ... JDR2
పై నెంబరు అమలులోగ్రందములో or 21 R64 & 66 నోటీసులు పై 2వ JDR అయిన మీ హాజరు నిమిత్తం వాయిదా **11-08-2025** కాబట్టి మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల వాయిదా తేదీ ఉదయం గం॥ **10.30** ని॥ల్కు పై కోర్టు ఎదుట హాజరయి తెలుపుకోవలెను.
వాయిదా.11-08-2025
ఓరుగంటి సుదాకర్
యం.యుగేషు
కాకినాడ అద్వకేట్లు
04-08-25 సెల్.9441143021

మహారాజశ్రీ కాకినాడ 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EP.388/2024 OS.No.1008/2019
Between:-
దిండి రాధాకృష్ణ ...DHR
And
సుంకర త్రిలేఖ@ కంచుస్తంభం త్రిలేఖ వగైరా ...JDRS
To.
అక్కిరెడ్డి పద్మలత W/o.త్రినాద్ Rep by GPA Holder మునగల శేషమాంభ దేవిW/o.రమేష్. 2-16A-8 శిరంగు వారి వీధి, వెంకటనగర్, కాకినాడ. ... JDR2
పై నెంబరు అమలులోగ్రందములో or 21 R64 & 66 నోటీసులు పై 2వ JDR అయిన మీ హాజరు నిమిత్తం వాయిదా **11-08-2025** కాబట్టి మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల వాయిదా తేదీ ఉదయం గం॥ **10.30** ని॥ల్కు పై కోర్టు ఎదుట హాజరయి తెలుపుకోవలెను.
వాయిదా.11-08-2025
ఓరుగంటి సుదాకర్
యం.యుగేషు
కాకినాడ అద్వకేట్లు
04-08-25 సెల్.9441143021